# వివేకము యొక్క స్వభావము

వచ్చిపోయే విషయములగురించి లేదా చంచల స్వభావము గల విషయములు, సందర్భముల గురించి ఎల్లపుడు ఎందుకు మాట్లాడెదనని నన్ను తరుచుగా ప్రశ్నించెదరు. ఆధ్యాత్మికతలో దీనిని గుర్తించి ముఖ్యముగా తెలుసుకొనవలెను. ఇదిలేకుండా సత్‌తత్వమును ప్రేమించుట అసంభవము. అస్థిరమైనది స్థిరమని భావించినపుడు సత్‌తత్వమును ప్రేమించలేమనునది విశదమే. సత్యసంధతను నటించుటకు మనము యిష్టపడుటయే దీనికి కారణము. సంఘటనలు మాత్రమే వచ్చిపోయేవి కావు. మన మానసిక, శారీరక, ఆధ్యాత్మిక చర్యలు మరియు నమ్మకములు, యింద్రియ జనితమైన జ్ఞానము, గ్రహణశక్తి, మరియు అనుభూతులు కూడా, ఉషఃకాలములోని సూర్యోదయమువలె లేదా వచ్చిపోయే వానజల్లులవలె, వచ్చిపోతూవుండు విషయములే. ఇవి అన్నియు భూత, వర్తమాన కాలములలో మన చేతలయొక్క ఫలితములే.

ఇది సందర్భములను, ఆలోచనలను, భావములను లేదా మరి యే యితర ప్రాకృతిక ఘటనలనైనను చెడగొట్టదు. ఇది ఒక సందర్భము యేమిటి లేదా యేమికాదు అనే వివరణ మాత్రమే యిస్తుంది. ఈ గుర్తింపువలననే, ఈ సందర్భములు శాపముగా మారుటకు బదులు ఆనందకరమైనవిగా మార్పుచెందును. ఈ విషయములతో మనము మమేకమైనపుడు, మనము భ్రమతో బాధపడక తప్పదు.

వాస్తవమునకు మనము పరిశుద్ధమైన చైతన్యము. అది దైవ వరము. దానితోనే మనము జన్మించినాము. అది మనచేత సృష్టింపబడలేదు. మనము సృష్టించుకొనిన (అవి చిన్న లేదా పెద్దవైనను) ప్రపంచములకు అదియే కారణము. ఇది అంతయు మన చేతల ఫలితము. ఎందువలననగా మన చేతలతో మనస్సును జతచేయుటవలన, దాని ఫలితములైన కష్టసుఖములకు వాస్తవికత చేకూరును. కాని యివన్నియు అశాశ్వతమైనవి. క్రియ యొక్క ప్రభావమున్నంతవరకే యిది కొనసాగును. "ఇది అంతయు వస్తువుల నడుమగల సరియైన సంబంధమును మన అజ్ఞానమువలన అర్థము చేసుకొనక పోవుటవలన మానవ మనస్సుయొక్క సృష్టిఫలితము. మన ఉద్రేకములు, ఆవేశములు మరియు ప్రేరణలు కూడా సమస్యను పెంపొందించుటలో పాలుపంచుకొనును. కొన్ని సందర్భములలో యివి అతి తీవ్రమైన సంక్షోభమును కలుగజేసి, నాశనము చేయునంత భయము కలుగజేయును. దీనంతటికి పరిస్థితులే కారణమని మనము ఆపాదించెదము" అని గురుదేవులు చెప్పినారు. ఇవన్నియు క్షణభంగురమైనవి కావున అవి మన నిజతత్వము కానేరదు. ఈ భ్రమ మన అలవాటై

వదలకున్నది.  లేనియెడల అది చాలా బాధాకరమైనది మరియు మనము యింతవరకు జాగ్రత్తగా పెంచిపోషించిన తప్పుడు అవగాహనయైన యిసుక గూళ్లను తిరిగి మనసులోనికి తెచ్చుకొనెదము.

మన స్నేహితులు మరియు శత్రువులు, వారి బాధలనుండి తప్పించుకొనుటకు వారికి యిష్టమైన రూపములు లేదా నమ్మకములను మనచేత నమ్మించుటకు తగిన తోడ్పాటు యిచ్చెదరు.  ఆవిధముగా ఒక మంద ఏర్పడుతుంది.  అటుల ఏర్పడిన విషవలయమునకు మందయొక్క సహకారము లభించును. వీరిని స్నేహితులు, సహాధ్యాయులు, తోటివారు, సత్సంగులు, అభ్యాసీలు అని పిలచెదరు;  కొన్నివేళలందు వారి ఉద్దేశము మంచిదై వుండవచ్చును. మనము జాగ్రత్తగా గమనించిన ఈ గురు శిష్య సమూహములు వారి సిద్ధాంతములను అమలుపరచి వారి భావములను మరియు కలలను విశదీకరించు క్రమములో ధనము సమకూర్చు కొనెదరు.  వారికి లబ్ధిచేకూర్చని భావములనుండి మనలను మళ్ళించుటకే యీవిధముగా చేసెదరు. కొన్ని భావాలు మరియు కలలు చాల క్రియాశీలమై వుండవచ్చును, వాటికి సాంఘిక సమ్మతికూడ లభించవచ్చునన్న విషయము యదార్థమే.

ఈవిధముగా ఏర్పడిన సంఘములు వారిస్థాయికి తగని వారిని దూరముగానుంచెదరు. మనలో వ్యక్తులను వారి విద్య, వాహనములు, ఆర్థికస్థితి, ఆస్తి, అంతస్తు, రాజకీయ పలుకుబడి, మతము, ఆధ్యాత్మికత మరియు అనేకమైన వాటిని ఆధారముగా గుర్తించుట దీనికి ఉదాహరణ. కాని యివి మన స్థితులకు గుర్తింపుకాదు. ఇవి అన్నియు బాహ్య మైనవి మరియు అశాశ్వతమైనవి. కావున వీటిని పరిగణలోనికి తీసుకొనరాదు.  మనము కానివాటితో మనలను గుర్తించుట బాధలను తెచ్చుకొనుటయే, మరి వాటిని తప్పించలేము. వీటితోటి మనలను గుర్తింపుచేసుకోవటం మానుకొనకపోయినచో అవి ఎప్పుడోఒకప్పుడు బాధలను కలుగజేయక మానవు.

అస్థిరమైనవాటిని కొద్దిగానైనా గుర్తించకపోయినచో సత్‌తత్వమును గూర్చి తెలుసుకొనుట సాధ్యముకాదు.  మనలను జీవితములో మిక్కిలి బాధ కలుగజేసిన బాధాకరమైన  సంఘటనను అల్పమైనదిగా గుర్తించుకొనవచ్చును.  కాని, మనకు కలుగు పరిస్థితులన్నియు అస్థిరమను భావన స్థిరముగా కలుగనిచో, వీటిని అస్థిరముగా గుర్తించలేని పాత అలవాటు మరల మొదలిడి, మన జీవిత స్వతంత్రతను హరించి  జీవితాంతము వేధించును.

మన జీవితాంతము అనేక సంఘటనలు వచ్చిపోతూ వుండుటవలన  మనకు అస్థిరత అనునది విశదముగా తెలుసునని పరిహాసముగా అనుకొనుట మరల మరల అశాశ్వతమైన

రూపములతో గుర్తించు అలవాటు మనకు విశదపడలేదనుటకు ఒక తార్కాణము. వివేకము తెలుసుకొనుట సులువు, నేర్చుకొనుట కష్టము, పొందుట మరింత కష్టము.

వివేకమనునది అందరికి తెలిసినప్పటికి దానిని వాస్తవముగా అర్థముచేసుకొనుటలో తప్పిదము చేయుటవలన దీనిని మరింతగా చెప్పవలసిన అవసరము కలుగుచున్నది. మనస్సు అనుభవములను మరియు సంఘటనలను ఊహించుకొనుటవలన లేదా తలచుకొనుచుండుటవలన వాటికి మరింత బలము చేకూరుస్తుంది. ఇది మనలో భావోద్రేకము కలుగజేస్తుంది. అప్పుడు సరియైన అనుభవములకొరకు వెదుకుటలో తమను, తమ ఊహలను, తలపులను, పరిస్థితులను మార్పుచేసుకొని వాటి ఫలితములతో పోల్చుకొనెదరు. ఇది అంతులేని అవివేకము. మానవులు వచ్చి, పోయే సంఘటనలను చూస్తారేమోకాని వాస్తవమైన దృక్పథముతో చూడకపోవుటవలననే యిది జరుగుచున్నదని నేను మరల మరల చెప్పెదను.

మరణమును సామాన్య మైన భావనతో ముడిపెట్టుట మనకున్న అనేక ఉదాహరణలలో వొకటి. స్వర్గ నరకములను ఊహించుకొనుటకు కారణమిదియే. ఇవి మరణము యొక్క మానసిక భావనలు. మనము మనఃపూర్వకముగా చూచిన నరకముకూడా అహంకారమును ఉపశమింపజేయునదిగా గమనించవచ్చును. ఎందువలననగా యమయాతనున్న నరకములోకూడా మన అహంకార భావన సజీవమైయుండును. సత్‌తత్వములో జీవించుటకన్న అనేకవిధములైన అసంభవమైన విషయములను నమ్ముటకు మనము యిష్టపడుటయే నిజముగా ఆశ్చర్యకరమైన విషయము.

సత్‌తత్వములోనే మన జీవితము సార్థకత పొంది, అనవసరమైన బాధలు నివారింపబడును. దురదృష్టవశమున మరణమునకు సంబంధించిన స్వర్గము మరియు నరకము అను కల్పనలతో, ప్రజలు అనంతమైన భవిష్యత్‌కాలమున్నదను నట్లుగా జీవించెదరు. అనంతత్వము మనకు ప్రాప్తించునని దృఢముగా నమ్మించబడినది, అయితే జీవమున్న సత్యమును పట్టించుకొనుటకు మనము సిద్ధముగా లేము.

వాస్తవమునకు నిజతత్వములో జీవించుట కష్టమైనది కాదు. గృహస్థ జీవితములోని బాధ్యతల నడుమ కూడా నిజతత్వములో జీవించుట సులభము. బాధను తప్పించు కొనాలని మనము కోరుకున్నను, వాస్తవమునకు మనము ఎప్పుడు దానినుండి తప్పించుకొనలేము. దానికి కారణము మనకు మనముందున్న సత్‌తత్వముపై సరియగు అవగాహన లేకపోవుట మరియు మనకుగల భ్రాంతి. వచ్చిపోయే సంఘటనలను మరియు అనుభవములను

గ్రహించుటయే మన స్వప్నములను మరియు అసత్యములను వదిలివేయుచున్నా మను దానికి ఆరంభము. అందులో ఏవోకొన్నిటిని మాత్రమే కాక అన్నిటినీకూడా తెలుసుకొనవలెను. అదియే వివేచనాశక్తి.

నిజతత్వములో జీవించుటకు బదులుగా, మనము ఎవరము అను దానిగురించిన ఊహలు మరియు కల్పనలో జీవించుట మనకు సులభముగా తోచును. దీనివలన బాధాకరమైన బ్రాంతిని మనము తప్పించుకొంటాము. మన మనసులోనున్న వాటినే మనము వదులుకొనుటకు భయపడెదము. లేదా యివి మనగురించిన భావనలని చెప్పవచ్చును. అవి అన్నియు అవాస్తవము. మనము వాటిని చూచుటకు ప్రయత్నించిన ఎప్పటికీ కనుగొనలేము. ధ్యాన సమయములో క్షణకాలము పరానుభూతిగా పొందు నిశ్శబ్దములో కాల్పనికమైన ప్రాముఖ్యతతోపాటు అవన్నియు పోవును. మనము మన గురించి ఊహించుకున్నదంతయు పోగొట్టుకొనిన, మనము వాస్తవమునకు యేమియు కోల్పోలేదు. ఎందువలననగా తొలుత ఊహయే అవాస్తవమైనది.

నిజానికి మన కల్పనలతోను మరియు ఊహలతోను నిండిన మనస్సులో జీవించుట బహు కష్టమైన విషయము. ఇది సాధారణముగా కలుగు దుఃఖమును క్షణికమైన వినోదముతో లేదా కోరిక సాధించుటలో తప్పించుకొను ప్రయత్నము మాత్రమే. అందువలనే అనేకమైన వినోద ప్రదర్శనాస్థలములు లేదా చిరుతిళ్లు లభించు దుకాణములు ఎప్పుడూ పెరుగుతునే యుండుటలో ఆశ్చర్యము లేదు. మనకు వున్న అవకాశము యిదే అని జనులు నమ్ముటవలననే అందరూ వాటికొరకే అన్వేషించుచుందురు. ఇదేవిధముగా ఆధ్యాత్మికత కూడా ఈ బాధనుండి తప్పించుకొనుకోరికతో చేయు ప్రయత్నమే. ఇదియే పైన చెప్పబడిన స్వర్గము లేదా నరకమను విధానములో సోదాహరణముగా చెప్పబడినది.

అన్నివిధములైన అసందర్భమైన కల్పనలతో లేని మన వ్యక్తిత్వమును కాపాడుకొనుటయే యిందులోని యదార్థమైన విషయము. ఎందువలననగా దానికోసము మనము చూచినచో దానిని కనుగొనలేము. మన భావనలే ఈవిధమైన జ్ఞానము లేదా నేను అనుభావనను కలుగజేయును. ఈ స్పష్టత లేనివానికి వారి చైతన్యము పరిమితులకు లోబడి యుండును. ఇది దాని సృష్టియైన వస్తువులకు, వ్యక్తులకు, ఆస్తులకు మరియు భావములకు కట్టుబడి మరు జీవితములో, దానిని పునర్జన్మ లేదా మరుజన్మ అనండి, వ్యక్తీకరించుటకు సమాయత్తమగును.

సమకాలీన మానవజాతి భావములకు బద్ధమై యున్నదను విషయము స్పష్టము. బహుశా

ఎల్లపుడు అదేవిధముగా వుండి వుండవచ్చును. ఆ భావములకు ప్రత్యామ్నాయముగ వేరే యితర భావములతో నింపిన గాని, వీటినుండి బయటపడుట యీ రోజులలో చాల కష్టమైనదిగా కనిపించుచున్నది. ఇది మళ్లీ యింకొక విష వలయము. వీటిని మనకు సరఫరా చేయుటకు అంతులేనంతమంది వ్యాపారులు సిద్ధముగా నున్నారు. దివ్యత్వము ఒక్కటేయైనను మనకు అంతులేని వ్యాపార వేత్తలు కలరు. ఇది మనస్సులో పోషింపబడి దానిలోనే జీవించుటకు తోడ్పడును. మనస్సులో జీవించుటయే మాయ లేదా భ్రమలకు సరియైన అర్థము. భ్రమలను లేదా నటించుటను అవి నిజముగా యేమిటని గుర్తించినచో మనము ముక్తి పొందినటులే. మనలోని అసంతృప్తివలన ఉద్భవించిన సత్యమును ప్రేమించవలెనను ఆకాంక్షనే దివ్య స్వభావముగా పిలువవచ్చును. ఎందుకంటే అదియే మనలను నేను అను భ్రమనుండి విముక్తి కలుగజేయును. అప్పుడు మాత్రమే "నేను ఎవరు" అను ప్రశ్న స్వభావికముగా ఉదయించును. అపుడు మన నిజతత్వము నెమ్మదిగా ఎరుకలోనికివచ్చి చివరకు మన మూలతత్వమైన అనంతత్వములో ముగియును. అపుడు మన మనస్సు నిర్మలమై మనకు అనుకూలముగా ఉపయోగించును. అపుడు సత్‌తత్వమును అందులో వున్నది వున్నట్లుగా మనము వాస్తవముగా అనుభూతి చెందుదుము.

అవివేకమైన మన బాధలనుండి మన స్వీయతత్వము మాత్రమే మనకు ఆశ్రయమిచ్చును. ఎవ్వరును వాటిని యివ్వను లేరు లేదా తీసుకొనను లేరు. యోగ మార్గము యిరుకైనది. మనము ఒంటరిగానే పయనించవలెను. ఇతరులు ఈ మార్గములో స్థిరపడుటకు మనము చేయగలిగిన సహాయము తప్పక చేయవలెను. అది దైవ నిర్ణయము. మన జీవితములో ఈవిధముగా జీవించు అవకాశమును వ్యర్థపరచకుండుట తెలివైన నిర్ణయము.

అందువలనే నేను వచ్చిపోయే సంఘటనలగురించి మరియు అనుభవముల గురించి మాట్లాడుతూవుంటాను.

* * *

(పూజ్య శ్రీ కె.సి.నారాయణగారి విరచితమైన బోధయంతి పరస్పరం మూడవ సంపుటిలోని 'Nature of Viveka' అనుదానికి యిది స్వేచ్ఛానువాదము. సాధకులు మరింత అవగాహనకు మూలమును ప్రామాణికముగా తీసుకొనవలసినదిగా మనవి చేయుచున్నాను. - వి. రామం)